క్లుప్తంగా

మజ్దూర్ యూనియన్‌దే ఉద్యోగ భద్రత విజయం



విజయోత్సవ వేడుకల్లో మజ్దూర్ నేతలు

పుత్తూరు: ఆర్టీసీ ఉద్యోగుల కోసం తొలిసారిగా 01/2019 ఉద్యోగ భద్రతకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఎస్‌ఎంయుఏ చేసిన పోరాట ఫలితమేనని పుత్తూరు డిపో అధ్యక్షుడు ఎస్.సుందరం పేర్కొన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం డిపో వద్ద యూనియన్ నాయకులు రాష్ట్ర నాయకులు పి.వి.రమణరెడ్డి, వై.శ్రీనివాసరావు ఫొటోలకు పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, యాజమాన్యం, ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎం.శివకుమార్, నాయకులు రమేష్, వాసు, కుమార్, ధనరాజ్, ఎన్‌కే రెడ్డి, శేఖర్, నాగరాజు, వినోద్‌కుమార్, కన్నయ్య, సెల్వం, ప్రకాష్, వినాయకం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కోసం ప్రణాళిక



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు: మామిడి రైతులకు మద్దతు ధర వచ్చేలా ప్రణాళికలు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని మోతరంగనపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో మామిడి పంటపై సమీక్ష నిర్వహించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే, జూన్, జూలై, ఆగస్టు నెలలో పంట దిగుమతిపై అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే రైతుకు మంచి మద్దతు ధర వచ్చి అధిక లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. మండల, జిల్లా వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో మామిడి సాగు ఉంది, ఎంత దిగుబడి వస్తుందనే దానిపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో గుంటూరు ఎస్పీ, కడప కలెక్టర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి శుక్రవారం ప్రముఖులు దర్శించుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. తర్వాత ఈవో పెంచలకిషోర్ వారికి శేషవస్త్రం, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వెల్లడించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని చెప్పారు. జ్వరాలు సోకిన వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

తవణంపల్లె: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతానని ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని పటన్నం, ఎగువ తవణంపల్లె రోడ్డు, పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలను మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడితే సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆటోలు అధిక లోడ్లుతో నడిపితే చర్యలు తీసుకొంటామన్నారు.ఎస్‌ఐతో పాటు హెచ్‌సీ అమీర్‌భాషా, సిబ్బంది పాల్గొన్నారు.





మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు, (ఇన్‌సెట్) జగనన్న మహిళా మార్టు

విజయపథాన మహిళా మార్టు

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మహిళలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిస్తూ వచ్చింది. అందులో భాగంగానే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వారిని వ్యాపార రంగంలోకి తీసుకొచ్చారు. పుత్తూరులో అప్పటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఏర్పాటైన జగనన్న మహిళా మార్టు నేటికీ విజయపథంలో పయనిస్తోంది. –పుత్తూరు

- నాటి జగనన్న ఆలోచనే నాంది
- జగనన్న మహిళా మార్టుతో అభివృద్ధి
- చౌకగా నాణ్యత కలిగిన వస్తువులు ఒకేచోట లభ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సైతం మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నేడు సత్ఫలితాలిస్తోంది. మహిళలకు అతి తక్కువ పెట్టుబడి తో ఆదాయ వనరులను సమకూర్చే జగనన్న ఆలోచనకు ప్రతిరూపమే జగనన్న మహిళా మార్టులు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటైన పుత్తూరులోని జగనన్న మహిళా మార్టు నేడు మహిళలను ఆదాయం వైపు నడిపిస్తోంది. గత ఏడాది మార్చి 4వ తేదీన స్థానిక కావమ్మ ఆలయం సమీపంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఈ మార్టు ఏర్పాటైంది. పుత్తూరు పట్టణ పరిధిలోని 1,047 స్వయం సహాయక సంఘాల్లోని 10,014 మంది మహిళా సభ్యులు ఈ మార్టుకు యజమానులు. ఒక్కొక్కరి పెట్టుబడి కేవలం రూ.150 మాత్రమే. అయినా మొత్తం పెట్టుబడి రూ.15.02 లక్షలు. ఒక మేనేజర్, ఐదుగురు మహిళా సభ్యులు వివిధ హోదాల్లో మార్టు నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నేటి పోటీ వ్యాపార ప్రపంచంలో తట్టుకొని నిలబడాలంటే తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా మార్టు నిర్వాహకులు పక్కా ప్రణాళికతో అమ్మకాలను పెంచుతున్నారు. ఫలితంగా వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. నెలకు రూ.5 లక్షల అమ్మకాలతో ఏడాది టర్నోవర్ రూ.60 లక్షలు కాగా రూ.కోటి లక్ష్యంతో సభ్యులు పనిచేస్తున్నారు.

మార్టు వివరాలు	
సభ్యుల సంఖ్య	10,014
పెట్టుబడి 10,014 X 150=	రూ.15.02 లక్షలు
రోజువారీ సరాసరి అమ్మకాలు	రూ.20 వేలు
నిర్వహణ సిబ్బంది	
మేనేజర్	1
క్యాషియర్స్	2
ప్యాకర్స్	4
మొత్తం	7

విజయసారథులు

మహిళా మార్టు విజయపథాన పయనించడానికి మార్టు యజమానులు, వినియోగదారులు సైతం స్వయం సహాయక సభ్యులైన మహిళలే కావడం ప్రధాన కారణం. పనిచేసే సిబ్బంది సైతం వారే కావడం మరో విశేషం. అంతే కాకుండా మార్కెట్‌లో లభించే ధరలకంటే తక్కువ ధరకు, నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందిస్తున్నారు. ఇలా సంఘ సభ్యుల సహకారంతోపాటు అధికారుల పర్యవేక్షణతో పుత్తూరు జగనన్న మహిళా మార్టు విజయవంతంగా నడుస్తోంది. రానున్న రోజుల్లో మార్టు వ్యాపారం కోట్లకు ఎగబాకుతుందనడంలో సందేహం లేదు.

ఆర్థికాభివృద్ధికి దోహదం



మహిళా మార్టు ఏర్పాటు మా జీవితాల్లో సరికొత్త మలుపును తీసుకొస్తుందని నమ్మకం కలిగింది. ఇందుకు మార్టులో జరుగుతున్న అమ్మకాలే కారణం. సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను సైతం మార్టులో ఉంచి విక్రయిస్తున్నాం. దీంతో సభ్యులు తమ ఉత్పత్తులను మరింత పెంచుతున్నారు. ఈ వ్యాపార మార్గంతో ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.

–ఎ.జయలక్ష్మి, మార్టు సభ్యురాలు, నందిమంగళం

10 శాతం ధర తక్కువకే ఇస్తున్నారు



మహిళా మార్టులో అందుబాటులో ఉన్న ప్రతి వస్తువు నాణ్యత బాగుంది. బయటి ధరల కన్నా 10 శాతం తక్కువ ధరకు లభించడం సంతోషకరమైన విషయం. దాదాపు అన్ని వస్తువులు అందుబాటులో ఉన్నాయి. అందుకే మార్టులోనే అన్ని కొనుగోళ్లు చేస్తున్నాం.

–పి.అమరావతమ్మ, వినియోగదారు, పుత్తూరు

పెద్ద సంఖ్యలో వినియోగదారులు



మార్టు విజయవంతంగా నడవడానికి పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఉండడమే ప్రధాన కారణం. పదివేలకు పైగా ఉన్న సంఘ సభ్యులందరూ ఇందులో వాటాదారులు కావడంతో, ప్రతి సభ్యురాలు నెలవారీ సరుకులను ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు. దీంతో అమ్మకాలు అమాంతం పెరుగుతున్నాయి.

–ఎస్.వేదవతి, సంఘ సభ్యురాలు, పుత్తూరు

రూ.కోటి లక్ష్యం

మహిళా మార్టు విజయపథంలో నడుస్తోంది. తొలి ఏడాది టర్నోవర్ రూ.60 లక్షలు జరిగింది. దీనిని రూ.కోటికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సభ్యులు పనిచేస్తున్నారు. సభ్యులందరూ తమ వంతు సహకారం అందించడంతోనే మార్టు ఎంతో విజయవంతంగా నడుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన కోసం మహిళా మార్టు ఎంతో దోహదం చేస్తోందనడంలో సందేహం లేదు.

–సునీత సిటీ మేనేజర్, మెప్మా, పుత్తూరు

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నగరి: కిశోర బాలికలు ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం నగరి, నిండ్ర, విజయపురం మండలాలవారికి బుగ్గఅగ్రహారం గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో వచ్చే నష్టాలను తెలియజేశారు. సమతుల ఆహారంతోపాటు ఆరోగ్యంగా ఉండడానికి ఏయే పోషకాలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో డీఎస్పీ

నగరి: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు వాటికి సంబంధించిన పుస్తకాలను డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ వితరణగా అందించారు. శుక్రవారం తన కార్యాలయం వద్దకు ఇంటర్, డిగ్రీ పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులను రప్పించి వారికి పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నిండ్ర: ఖరీఫ్‌లో వరి పంటకు ఆశించే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శుక్రవారం మండలంలోని అగరం, నిండ్ర గ్రామాల్లో వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వరిలో లద్దెపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిందుమాలతి

గంగాధరనెల్లూరు: సమాజంలో బాల్య వివాహాలను అరికట్టి ఉన్నత విద్యపై దృష్టి సారించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిందుమాలతి అన్నారు. గంగాధరనెల్లూరు గ్రామ సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమం ద్వారా ఆడపిల్లలకు ఉన్నత విద్యపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. మహిళా పోలీస్ నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు వాణి, రజియా, హెల్పర్లు తులసి, మరియమ్మ, కస్తూరి, సిబ్బంది, యుక్త వయసు బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు మోటారుని మరమ్మతు చేస్తున్న సర్పంచ్ లిల్లీ ఆనందరాజ్, అధికారులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ వీర్లగుడి దళితవాడలో శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కారమైంది. సర్పంచ్ లిల్లీ ఆనందరాజ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు చొరవతో తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. రెండు రోజులక్రితం గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్న బోరు మోటారు మరమ్మతులకు గురైంది. గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని బోరు మోటారుని సరిచేసి బోరు బావిలో అమర్చి, తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామ ప్రజలు సర్పంచ్‌ని, అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

ఇంటి స్థలం చూపాలని దీక్ష

విజయపురం: కేవీపురం దళితవాడలో ఇల్లు లేని నిరుపేదలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని చూపాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. సీపీఐ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం అధ్యక్షతన శుక్రవారం కేవీపురం సచివాలయం ఆవరణలో రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్వేనెంబర్ 183లో 78 మందికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. అయితే లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఇంత వరకు చూపించకపోవడం బాధాకరమన్నారు. 40 రోజులుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఫోన్ ద్వారా మాట్లాడుతూ నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రిలే నిరహార దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఏసు పాదం, మహేంద్ర, రవి, శరవణ, రాజేష్, గోవిందస్వామి, పూర్ణిమ, ఆముద, మల్లీశ్వరి, జయంతి, యువరాణి, రాణెమ్మ, రేఖ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం



ఆరేటమ్మ ఆలయం వద్ద అన్నదానం

పుత్తూరు: గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయంలో శుక్రవారం ఏకాదశిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కె.మనోహర్‌రెడ్డి, వి.ఆర్ముగంరెడ్డి పర్యవేక్షించారు. ఉభయదారులుగా పుత్తూరుకు చెందిన వేణు, పద్మశ్రీ, ఏకాంబరం, రామచంద్రారెడ్డి వ్యవహరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నగరి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నాగరాజు కళా బృందం వారు కళాజాతా ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఉండడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తులపై చిన్న చూపు లేకుండా సమాజంలో కలసి జీవించాలి, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు క్షయ వ్యాధికి గల సంబంధం, సుఖ వ్యాధులు, కండోమ్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎయిల్ అరసు, స్టెప్స్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆరుముగం, ఏఎన్‌ఎం సుమ, ఓఆర్‌డబ్ల్యూస్ ఇందుమతి, పీర్ ఎడ్యుకేటర్స్ షీలారాణి, గుణసుందరి, మంజు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని ట్రస్టులకు ఓ దాత శుక్రవారం రూ. 2.50 లక్షల నగదు విరాళం చేశారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన అనికుమార్, సునీత రూ.1.25 లక్షలు, నిత్యఅన్నదానానికి రూ.1.25 లక్షలు గోసంరక్షణ ట్రస్టుకు అందజేశారు. ఈ నగదును ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం వారికి స్వామి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

సాగులో సాంకేతికతపై అవగాహన



సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శన

వెదురుకుప్పం: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని వ్యవసాయాధికారి వనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వెదురుకుప్పంలో రైతులకు స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన యాప్స్, డిజిటల్ చెల్లింపులు, యూట్యూబ్ చానెల్స్ నిర్వహణ, వాతావరణం, మార్కెట్ ధరలపై ఎప్పటికప్పుడు రైతులు చైతన్యం కావాలన్నారు. రైతులు తమ మొబైల్ ఫోన్‌లలోనే వ్యవసాయానికి సంబంధించి యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అన్ని రకాల విషయాలు సెల్‌ఫోన్‌ల నుంచే తెలుసుకునే సౌలభ్యం అందుబాటులో ఉందన్నారు. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు సాగు చేయాలి.. పంటల సాగుకు అవసరమైన మెళకువలు, వివిధ రకాల అంశాలకు సంబంధించి మొబైల్ యాప్‌లోనే నిక్షిప్తం అయి ఉందన్నారు. ప్రతి రైతు అధునాతన పద్ధతులలో పంటలను సాగు చేసేందుకు అలవాటు పడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో చేసే పంటల సాగు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని రైతులు గమనించాలన్నారు. అనంతరం ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు దయాకర్, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ కోవిడ్ అలర్ట్

- మాస్కులు తప్పనిసరిగా ధరించాలని తహశీల్దార్ ఆదేశాలు
- ముందస్తుగా గుర్తిస్తే ప్రమాదం లేదంటున్న వైద్యులు
- సభలు, సమావేశాలు, సామూహిక కార్యక్రమాలపై ఆంక్షలు



కోవిడ్ జేఎన్-1 వేరియంట్

నగరి: దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ ప్రజలను అలర్ట్ చేస్తోంది. కొన్నేళ్ల తరువాత ఎవరినోట విన్నా కరోనా మాటలే వినబడ్డాయి. కోవిడ్ భయాన్ని పూర్తిగా వదలిపెట్టి ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మళ్లీ జేఎన్-1 కొత్తరూపంలో నిశ్శబ్దంగా వచ్చి ప్రజల్ని కలవరపెడుతోంది. ఈ వైరస్ వేగంగా వ్యాపించే గుణం కలదని నిపుణులు తెలుపుతుండడం మరిచిపోయిన భయాన్ని మళ్లీ గుర్తు చేస్తోంది. పక్కన పడేసిన మాస్కు వాడకాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది. మన రాష్ట్రంలో కూడా కేసులు నమోదవుతుండడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమవుతోంది. మునుపంత ముప్పు లేకపోయినా జాగ్రత్తలు తప్పనిసరంటూ హెచ్చరిస్తోంది. అజాగ్రత్తగా ఉంటే పాత రోజులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. అయినవాళ్లను పోగొట్టుకున్నాం, వారు చెప్పి వెళ్లిన పాఠాలను జాగ్రత్తలుగా మలచుకొని వృద్ధుల కోసం, చిన్న పిల్లల కోసం అత్యంత జాగ్రత్త తీసుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

మాస్కులు తప్పనిసరి

కోవిడ్ వ్యాప్తి వేగంగా ఉన్న తరుణంలో మాస్కులు వాడకం తప్పనిసరని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ నుంచి స్థానిక అధికారులకు ఆదేశాలు అందాయి. తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించింది. ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, బహిరంగ కార్యక్రమాలు తదితర అన్ని సామూహిక సమావేశాలను వాయిదా వేయాలని, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద కోవిడ్-19 ప్రవర్తన నియమావళి పాటించాలని స్పష్టం చేసింది. 60 ఏళ్లకు పైబడిన వారిని, గర్భిణీలను ఇంటికే పరిమితం చేయాలని సూచించింది. పరిశుభ్రతను పాటించాలని, మాస్కులు ధరించాలని, కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షించుకొని వైద్యచికిత్స చేయించుకోవాలని తెలిపింది. జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వాంతులు, విరేచనాలు వీటి లక్షణాలని సూచించారు. ఈ లక్షణాలున్న వారు వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

మాస్కులు అందరూ వాడాలి



కోవిడ్ వ్యాప్తి నేపథ్యంల అందరూ తప్పనిసరిగా మాస్కులు వాడాలి. కార్యాలయాలు, జనం అధికంగా గుమిగూడే బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్, వివాహాలు, శుభకార్యాలు, సినిమా హాళ్లు, ఆలయాలు, వారపు సంత తదితర ప్రాంతాల్లో మాస్కులు తప్పనిసరి. బహిరంగ సమావేశాలు, సామాజిక సమావేశాలు వాయిదా వేసుకోవాలి. ప్రతి ఒక్కరు కోవిడ్-19 నిబంధనలు తప్పక పాటించాలి.

–రవికుమార్, తహశీల్దార్, నగరి మండలం

వ్యాధి నివారణ చర్యలు తీసుకోండి

నిండ్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య అన్నారు. శుక్రవారం ఐఆర్ కండ్రిగ పాడి రైతులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా పాడిఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.